



www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

ఆదివారం | 20 | జూలై | 2025 పేజీలు : 8


# విప్లవకారుల మృతదేహాలకు భయపడుతున్న బిజెపి






- హామీలు నెరవేర్చకుంటే పోరుబాటే
- సమాజాన్ని కాపాడేది కమ్యూనిస్టులే
- సిపిఐ జిల్లా మహాసభల్లో కూనంనేని





**ప్రజాపక్షం/ ఖమ్మం :** విప్లవకారుల మృతదేహాలకు బిజెపి నేతలు భయపడుతున్నారని, హతమార్చిన తర్వాత మృతదేహాలను కుటంబీలకు ఇచ్చేందుకు జంకుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. మరణించిన తర్వాత కూడా విప్లకారులు ప్రజలను చైతన్యవంతులను చేస్తారనే భయంతో బిజెపి నేతలు జంకుతున్నారని, విప్లకారులను లేకుండా చేయడం ఎవరితరం కాదన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం 23వ మహాసభలు శనివారం మధిర నియోజకవర్గ కేంద్రంలోని పోటు ప్రసాద్ నగర్ (రెడ్డి గార్డెన్స్)లో ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాసభలకు ముందు పార్టీ పతాకాన్ని సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు ఎగురవేశారు. మృతవీరుల స్మారక స్థూపాన్ని

మిగతా 2లో..



## ఘనంగా ప్రారంభమైన

# సిపిఐ మహాసభలు



- అరుణ పతాకాన్ని ఆవిష్కరించిన పువ్వాడ
- అరుణావర్ణమైన మధిర పుర వీధులు

**ప్రజాపక్షం/మధిర :** సిపిఐ ఖమ్మ జిల్లా 23వ మహాసభలు శనివారం పోటు ప్రసాద్ నగర్ (రెడ్డి గార్డెన్)లో ఘనంగా ప్రారంభమయ్యాయి. 20 మండలాలతో పాటు ఖమ్మం నగరం, మూడు మున్సిపాల్టీలకు ప్రాతినిధ్యం వహిస్తూ 600 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ప్రతినిధులంతా ఎర్రచొక్కాలు, ఎర్ర చీరెలు ధరించి రావడంతో మహాసభ ప్రాంగణం అరుణ వర్ణాన్ని పులుముకుంది. ఉదయం 8గంటల నుండే ప్రతినిధుల నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. మహాసభలో ప్రారంభ సూచికగా సిపిఐ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ పువ్వాడ నాగేశ్వరరావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించగా, అమర వీరుల స్మారక జ్యోతిని మహ్మద్ మౌలానా ప్రారంభించారు. గత

మిగతా 2లో..






# విప్లవకారుల మృతదేహాలకు భయపడుతున్న బిజెపి

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ బిజెపి నేతలు మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రశ్నించే వారిని లేకుండా చేయాలని చూస్తున్నారని, ఈ క్రమంలోనే మావోయిస్టులను తుద ముట్టిస్తామని అమిత్ షా లాంటి వారు ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. ప్రజల పక్షాన పనిచేసే కమ్యూనిస్టులను లేకుండా చేయడం ఎవరితరం కాదని, కమ్యూనిస్టు సిద్ధాంతం విశ్వ వ్యాపితమైన సిద్దాంతాన్ని ప్రతిపాదించిన కారల్‌మార్క్స్ ఆయనకు సహకరించిన ఎంగిల్స్ అమలు చేసిన లెనిన్ ప్రపంచ మానవాళి కొత్త వెలుగులు నిచ్చారన్నారు. సమాజహితం కోరే కమ్యూనిస్టుల అవసరం పెరుగుతోందని ఆయన తెలిపారు. ప్రపంచంలో సగం జనాభా కమ్యూనిస్టుల పాలనలోనే ఉన్నారని, దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తే భారతదేశంలో కూడా ఘనీయమైన స్థానాలు దక్కుతాయని ఆయన తెలిపారు. బూర్జువా పార్టీల అంతిమ లక్ష్యం అధికారమేనని, కమ్యూనిస్టులకు మాత్రం ప్రజాభ్యుదయం సమాజ మార్పు, ఆర్థిక అసమానతలు లేని సమాజన మార్పు, ఆర్థిక అసమానతలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యం అన్నారు. దోపిడికి వ్యతిరేకంగా పురుడుపోసుకున్న కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే అనేక చట్టాలు రూపొందాయని, సంక్షేమ అమలవుతోందని, ఇప్పుడు బిజెపి ఆ చట్టాలను రద్దు చేసేందుకు ప్రయత్నిస్తుందని కూనంనేని తెలిపారు. ప్రజల పక్షాన కమ్యూనిస్టులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. అప్పులున్నాయని రాష్ట్ర ప్రభుత్వం హామీలు అమలు చేసేందుకు జాప్యంచేస్తే సిపిఐ పోరుబాటు పట్టక తప్పదని ఆయన హెచ్చరించారు. మాజీ భారత ప్రధాని మన్మోహన్ సింగ్ మాదిరి అప్పుల నుంచి బయటపడే మార్గాలను అన్వేషించాలని, సంక్షేమ,ం అభివృద్ధి విషయంలో నాన్చివేత ధోరణి మానుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల్లో తమ బలానికి అనుగుణంగా పొత్తులు కుదిరితే కలిసి పోటీ చేస్తామని, లేదంటే ఒంటరి పోరుతో తమ సత్తా చాటుతామన్నారు. పార్టీ సభల్లో విప్లవ కార్యాచరణతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటమి తర్వాత కొందరు నాయకులు వేరు దారులు వెతుక్కుంటారని, అదే దారిలో బిఆర్ఎస్ కవిత పయనిస్తోందని ఆయన తెలిపారు. ప్రజల మధ్య ఉండే కమ్యూనిస్టుల అవసరం పెరుగుతోందని, అందుకు అనుగుణంగా ప్రజల పక్షాన నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**చారిత్రిక పోరాటాలు సిపిఐ సొంతం : నెల్లికంటి**

స్వాతంత్ర్యానంతరం అనేక చారిత్రక పోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ నేతృత్వం వహించిందని, ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా ఉద్యమ కేంద్రంగా బాసిల్లిందని సిపిఐ రాష్ట్ర నాయకులు, శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం తెలిపారు. సిపిఐ మహాసభల్లో ఆయన మాట్లాడుతూ నాడు సంపూర్ణ స్వాతంత్ర్యానికి కమ్యూనిస్టులే పిలుపునిచ్చారని, ఆ నాటినుండి ఇటీవల తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు నిచ్చిన జాతీయ పార్టీగా సిపిఐ ఖ్యాతి గడించిందన్నారు. వందేళ్లలో అనేక ప్రజా ఉద్యమాలను నిర్వహించామని, సుదీర్ఘ పోరాటాలు కమ్యూనిస్టులు పార్టీని చిరస్థాయిగా నిలిపాయని ఆయన తెలిపారు. సంస్థాగత నిర్మాణంలో భాగంగా మహాసభలను నిర్వహించుకుంటున్నామని, ఈ సభల్లో భవిష్యత్ కార్యక్రమాలపై విస్తృత చర్చజరగాలని ఆయన కోరారు. బిజెపి రామ జపం చేస్తోందని, కానీ అయోధ్యలో ప్రజలు బిజెపిని ఓడించారని గుర్తు చేశారు. నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఆనెల 9న జరిగిన సార్వత్రిక సమ్మెకు అపూర్వ మద్దతు లభించిందన్నారు. నూతన సాగు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు బిజెపి తలవంచక తప్పలేదని ఆయన తెలిపారు. లౌకిక వాదం,సోషలిస్టు తదితర పదాలను రాజ్యాంగం నుండి తొలగించేందుకు బిజెపి కుట్ర చేస్తోందన్నారు. ఆ కుట్రలు, మతోన్మాదం, కార్పొరేటీకరణ వ్యతిరేకంగా పోరాడాలని నెల్లికంటి పిలుపునిచ్చారు. కమ్యూనిస్టుల పోరాటాలు మాత్రమే ప్రజల హక్కులుసాధించి పెడతాయని ఆయన స్పష్టం చేశారు. జమ్ముల జితేందర్‌రెడ్డి, మందడపు రాణి, అజ్మీరా రామ్మూర్తి, దొండపాటి రమేష్, మేకల శ్రీనివాసరావు, యంగల ఆనందరావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈ మహాసభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ఎర్రా బాబు, ఎస్కే జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, ఆహ్వాన సంఘం బాధ్యులు కర్నాటి రామ్మోహన్‌రావు, బెజవాడ రవిబాబు, ఎం.ఎ.రహీం, ఊట్ల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన సిపిఐ మహాసభలు

(మొదటిపేజీ తరువాయి)

మహాసభలు జరిగిన వైరా నుండి అఖిల భారత యువజన సమాఖ్య కార్యకర్తలు అమరజ్యోతిని తీసుకురాగా సిపిఐ నాయకులు ఆ జ్యోతిని అందుకున్నారు. మహాసభల ప్రారంభం కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా తదితరులు పాల్గొనగా సంతాప తీర్మానాన్ని సిద్దినేని కరుణకుమార్ ప్రవేశపెట్టారు. మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా వ్యవహరించిన కర్నాటి రామ్మోహన్‌రావు అధ్యక్షోపాన్యాసాన్ని చేశారు. కార్యదర్శి నివేదికను జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ప్రవేశపెట్టారు. సభ ప్రారంభానికి ముందు అధ్యక్ష వర్గం తీర్మానాల కమిటీ మహాసభల స్టిరింగ్ కమిటీ అర్హతల కమిటీ మినిట్స్ కమిటీలను ఏర్పాటు చేసి ప్రతినిధుల ఆమోదాన్ని తీసుకున్నారు. రెండ్రోజులు పాటు జరగనున్న సభల్లో తొలిరోజు పలు తీర్మానాలు ఆమోదం పొందాయి. వివిధ మండలాలు, పట్టణ బాధ్యులు కార్యదర్శి నివేదికపై చర్చల్లో పాల్గొన్నారు. అధ్యక్షవర్గంగా జమ్ముల జితేందర్‌రెడ్డి, మందడపు రాణి, అజ్మీరా రామ్మూర్తి దొండపాటి రమేష్, మేకల శ్రీనివాసరావు, యంగల ఆనందరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి రామ్మోహన్‌రావు, కార్యదర్శి బెజవాడ రవిబాబు, బాధ్యులు ఊట్ల కొండలరావు, ఎంఎ రహీం తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్‌కిడ్జ్‌లో బోనాల వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకైన బోనాల వేడుకలను ఖమ్మం నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు సాంప్రదాయబద్ధంగా బోనాలను తయారు చేసి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారు, పోతురాజు వేషధారణలతో విద్యార్థులు కనువిందు చేశారు. విద్యార్థులు చీరకట్టు సాంప్రదాయ దుస్తులు ధరించి ఇంటి వద్దనే బోనాలు తయారు చేసుకుని వచ్చి పాఠశాల సమీపంలోని పుర వీధుల్లో నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సమీపంలోని అమ్మవారి ఆలయంలో మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు విశిష్ట స్థానం ఉందన్నారు. మారు మూల పల్లెల నుంచి నగరం వరకు బోనాల సంబురాలు ఆషాఢం, శ్రావణమాసంలో ఘనంగా నిర్వహిస్తారన్నారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు బోనాల విశిష్టతను తెలియజేసేందుకు ప్రతి సంవత్సరం తమ పాఠశాలలో బోనాల వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంస్కృతి తెలిసేలా మ్యూజియం ఏర్పాటు







**ప్రజాపక్షం/ భద్రాచలం :** పాతతరం గిరిజన సంస్కృతి, వారి కట్టుబొట్లు నేటి తరం, విద్యార్థులు తెలుసుకుని ఆచరించేలా మ్యూజియం రూపొందించడం చాలా సంతోషంగా ఉందని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాల, పిఎంహెచ్ హాస్టల్ హెచ్ఎం సావిత్రి తెలిపారు. మ్యూజియం రూపకల్పన చేసిన ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి రాహుల్‌కు ప్రత్యేకంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఐటిడిఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 425 మంది, 20 మంది ఉపాధ్యాయులు సందర్శించారు.మ్యూజియంలో పొందుపర్చిన గిరిజనుల అన్ని కళాఖండాలను నిశితంగా తిలకించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సావిత్రి మాట్లాడుతూ అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు నేటి తరం బాల బాలికలకు తెలిసేవిధంగా కళాఖండాలు ఏర్పాటు చేయడం, వాటి యొక్క చరిత్ర ప్రదర్శించడం విద్యార్థిని విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగతమైందన్నారు. మ్యూజియంలో మాత్రం గిరిజనులకు సంబంధించిన స్పష్టమైన సమాచారం విద్యార్థులకు తెలిసేవిధంగా మ్యూజియం నిర్వాహకులు ప్రతి అంశం తెలియజేయడం చాలా బాగుందన్నారు. విద్యార్థిని విద్యార్థులకు ఆటవిడుపుగా ఇటువంటి సందేశాలు ఉన్న గిరిజన కళాఖండాలు చూపెట్టడం వలన వారిలో మేధాశక్తి పెరిగి గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు గురించి పూర్తి స్థాయిలో తెలుసుకుంటారని అలాగే పాతతరం గిరిజనులు వాడే పనిముట్లు, గిరిజన వంటకాలు చాలా అద్భుతంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, సరిత, పిడి వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరరావు, మ్యూజియం నిర్వాహకులు మాధవి, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## త్రివేణిలో బోనాల సంబురాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** త్రివేణి పాఠశాలలో బోనాల సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఆషాఢ బోనాల సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా॥ గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలలో బోనాల పండుగ ఎంతో విశిష్టమైందన్నారు. గ్రామ దేవతలను పూజిస్తూ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని బోనాలు అమ్మవారికి సమర్పిస్తారన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్రకుమార్ మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలు తెలపాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. త్రివేణిలో అన్ని పండుగలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సిఆర్‌వో కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌విఎంలో ఘనంగా స్టూడెంట్స్ ఎలక్షన్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని శ్రీనివాస్ నగర్‌లో గల ఎస్‌విఎం సెంట్రల్ పబ్లిక్ పాఠశాలలో విద్యార్థి సంఘ నాయకుల ఎన్నికలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి త్రీటౌన్ సిఐ మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుండే ప్రతి ఒక్కరూ నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో మెలిగి సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని, సోషల్ మీడియాను పరిశీలిస్తూ ఏది మంచి ఏది చెడు తెలుసుకుంటూ భావి భారత పౌరులుగా ఎదగాలన్నారు. పాఠశాల డైరెక్టర్లు డా॥ కిషోర్, కొండా శ్రీధర్‌రావు లు మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించడం వలన భారత రాజ్యాంగంలోని ఓటు హక్కుకు ఉన్న ప్రాధాన్యత తెలుస్తుందన్నారు. నేటి బాలలే రేపటి పౌరులుగా మారి సమాజం పట్ల, దేశం పట్ల క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. డైరెక్టర్ ఉమా కిషోర్ మాట్లాడుతూ మొత్తం మూడు విభాగాల్లో ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. సిపిఎల్, ఏఎస్పిఎల్, ఎస్పిఎల్ విభాగాలలో వారికి నచ్చిన విద్యార్థులను నాయకులుగా ఎన్నుకున్నారన్నారు. ఈ ఎన్నికల్లో విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ పర్యవేక్షణలో ఎన్నికల ప్రధాన అధికారి, రిటర్నింగ్ ఆఫీసర్, పోలింగ్ ఆఫీసర్ మొదలగు వారిని నియమించి విద్యార్థులకు బ్యాలెట్ పేపర్, ఈవిఎం ద్వారా రెండు విధాలుగా ఎన్నికల నిర్వహణ చేపట్టారు. ఎన్నికల నిర్వహణ అధికారిగా సోషల్ టీచర్ నాగరాజు వ్యవహరించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సర్వజ్ఞ పాఠశాలలో బోనాల వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలోని సర్వజ్ఞ పాఠశాలలో బోనాల వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. శనివారం బోనాల పండుగను తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా నిర్వహించారు. బోనాల సందర్భంగా పాఠశాల చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వి నాగేంద్రకుమార్, నీలిమ లు మాట్లాడుతూ బోనాలు కేవలం పండుగ మాత్రమే కాదని ఇదొక సామూహిక వేడుక అన్నారు. పల్లె నుంచి నగరం దాకా ప్రజలంతా కలిసి అమ్మవారిని కొలిచి బోనాలు సమర్పిస్తారని తెలిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఈ పండుగను ఆషాఢం, శ్రావణమాసంలో నిర్వహిస్తారన్నారు. తెలంగాణ సంస్కృతిలో బోనాలు ఒక భాగమన్నారు. సర్వజ్ఞ పాఠశాలలో విద్యతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలను చిన్ననాటి నుంచే తెలిపేలా ఇటువంటి వేడుకలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎన్ఆర్ఐ ప్రతినిధులుగా రవికుమార్, స్వాతి, లాస్య, శాన్వి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పథంలో భద్రాద్రి కొత్తగూడెం



### -రేడియో ప్రత్యక్ష ప్రసారంలో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

**ప్రజాపక్షం/ భద్రాచలం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి వినూత్న ఆలోచనతో ఆలిండియా రేడియో కొత్తగూడెం కేంద్రం ద్వారా అభివృద్ధి పథంలో భద్రాద్రి కొత్తగూడెం అనే ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఉదయం 8.30 గంటల నుండి 9.30 గంటల వరకు నిర్వహించిన ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. జిల్లా ప్రజలు లైవ్ ఫోన్ కాల్ ద్వారా కలెక్టర్‌తో నేరుగా మాట్లాడే అవకాశాన్ని కల్పించడంతో వివిధ మండలాల నుంచి ప్రజలు ఎన్నో సమస్యలు, అభిప్రాయాలు, సూచనలు తెలిపారు. ప్రజల ఆరోగ్యం, విద్య, గ్రామీణ రహదారులు, త్రాగునీటి సమస్యలు, రేషన్ కార్డుల జారీ, పెన్షన్ జాప్యం, వ్యవసాయ సవాళ్లు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి వంటి కీలక అంశాలను ప్రస్థావించారు. కలెక్టర్ ప్రతి అంశాన్ని ఆసక్తిగా వినడంతో పాటు సమస్యలపై తక్షణం స్పందించారు. కొన్ని సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి అభిప్రాయం ఎంతో విలువైంది. ప్రజల అభ్యర్థనలు, సమస్యలు పాలనకు మార్గదర్శకంగా పనిచేస్తాయన్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడే ఈ తరహా కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తూ జిల్లా అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందిస్తామని తెలిపారు. వ్యవసాయం వ్యర్థం కాదని అది జీవనాధారమని కలెక్టర్ స్పష్టం చేశారు. యువత అందరూ ఉద్యోగాల కోసం నిరీక్షించకుండా ఉన్న భూములను సద్వినియోగం చేసుకుంటూ ఆయిల్ ఫామ్, మునగ సాగు, చేపల పెంపకం వంటి ఆధునీక వ్యవసాయ మోడళ్ల ద్వారా యువత ఆర్థికంగా ఎదగాలన్నారు. వ్యవసాయంలో ఆధునీక పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలన్నారు. జిల్లాలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలియజేస్తూ ప్రతి పౌరుడు జిల్లా అభివృద్ధిలో భాగస్వాముడిగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం హెడ్ కోలిపాక శంకర్‌రావు, సిబ్బంది ప్రభాకర్, ఆనంద్, సుమన్, కోటేశ్వరరావు, కట్ట రామకృష్ణ, శ్రీనివాస్, మహిళా రేడియో జాకీలు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మమ్మకు నివాళులర్పించిన మాజీ మంత్రి పువ్వాడ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మన తెలంగాణ ఖమ్మం జిల్లా బ్యూరో వనం వెంకటేశ్వర్లు మాతృమూర్తి వనం లక్ష్మమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె మృతిపట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. శనివారం వనం వెంకటేశ్వర్లు స్వగృహంకు వెళ్లి లక్ష్మమ్మ చిత్ర పటానికి పువ్వాడ అజయ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. లక్ష్మమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోల రాంనారాయణ, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులకు స్థానమివ్వని అధికారపార్టీ నేతలు

### -వేదిక దిగాలంటూ హెచ్చరించిన దుర్గాప్రసాద్



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో ఏప్రభుత్వ కార్యక్రమం జరిగినా మండల నాయకులు చివరకు గల్లీ నాయకులు కూడా వేదికలెక్కి ఆసీనులవుతున్నారు. మంత్రులు పాల్గొనే కార్యక్రమాలు మొదలు ఏకార్యక్రమమైనా ప్రత్యేకించి ప్రభుత్వ కార్యక్రమాలైనా అధికార పార్టీ నాయకులు పోటీలు పడి వేదికను ఆక్రమిస్తున్నారు. చాలా సందర్భాలలో జిల్లా మండల అధికారులకు సైతం వేదికపై స్థానం దొరకడంలేదు. ఈ విషయమై గతంలో ప్రజాపక్షం ప్రత్యేక వర్తా కథనాన్ని ప్రచురించింది, శనివారం వైరాలో వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో ఇందిరా మహిళాశక్తి సంబరాలు జరిగాయి. ఈసంబరాలకు వైరా శాసన సభ్యులు మాళోత్ రాందాస్‌నాయక్ హాజరుకాగా ఎప్పటిలాగానే వేదికపై అధికారులకు నిర్వహణా భాద్యులకు అవకాశం ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ నేతలు కుర్చీలను ఆసీనులయ్యారు. ఈ సమయంలో అక్కడకు చేరుకున్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పరిస్థితిని గమనించి కాంగ్రెస్ నాయకులను తీవ్రంగా మందలించారు. బాద్యులు అధికారులు మినహా మిగిలనవారంతా వేదిక దిగాలంటు గట్టిగా హెచ్చరించారు. విధిలేక కాంగ్రెస్ నేతలు అధికారులకు అవకాశం ఇచ్చి సబికులలో కూర్చోక తప్పలేదు.

# పామాయిల్ పంటసాగు రైతులకు లాభదాయకం

### జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

**ప్రజాపక్షం/వైరా :** రైతులకు పామాయిల్ సాగు లాభదాయకమైన పంట అని జిల్లా వ్యవసాయ అధికారి దాసరి పుల్లయ్య అన్నారు. శనివారం వైరా మండలం రెబ్బవరం గ్రామ సమీపంలో సరిపూడి సతీష్ అనే రైతు 11 ఎకరాల్లో వేసిన పామాయిల్ తోటను మండల వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా దాసరి పుల్లయ్య మాట్లాడుతు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పామాయిల్ సాగు వైపు మొగ్గు చూపుతున్నారని విపత్కర పరిస్థితుల సమయంలో పామాయిల్ సాగు నష్టాన్ని తట్టుకుంటుందని రైతులకు ఇబ్బంది కలగదని అన్నారు. ప్రభుత్వం కూడా పామాయిల్ సాగుకు సహకారం అందిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధిఆరి



ముంజుఖాన్, ఆర్టకల్చర్ అధికారి వేణు, ఏఈఓ వెంకటనర్సయ్య పలువురు రైతులు పాల్గొన్నారు.

# కెటిఆర్ జైలుకెళ్లే సమయం ఆసన్నమైంది..

### - బిఆర్ఎస్ పది సంవత్సరాలు పాలన అవినీతితో నిండిపోయింది

### -హస్తకళా కార్పోరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ



**ప్రజాపక్షం/వైరా:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ జైల్లో విశ్రాంతి తీసుకునే సమయం ఆసన్నమైందని హస్తకళా చైర్మన్ నాయుడు సత్యనారాయణ అన్నారు. శనివారం వైరాలో వ్యవసాయమార్కెట్ యార్డులో జరిగినా ఇందిరా మహిళాశక్తి సంబరాల్లో పాల్గొన్న నాయుడు సత్యనారాయణ కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఖమ్మం ప ర్యటనలో కేటీఆర్ మాట్లాడిన విధనంపై నాయుడు సత్యనారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కమీషన్‌ల కోసం కక్కుర్తిపడేది కేటీఆర్‌నని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా మంచి ప్రజా పాలన అందిస్తుంటే ఓర్వలేక కేటీఆర్ అవాకులు చెవాకులు పేలుతున్నారని పద్ధతి మార్చుకోకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి ప్రజలే బుద్ధి చెపుతారని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై త్వరలోనే జైల్లో విశ్రాంతితీసుకుంటారని తెలిపారు. రాష్ట్రంలో రేషన్ కార్డుల పంపిణీ పండుగలాగా జరుగుతుందని ఆయన తెలిపారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ నేతలు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడకపోతే బుద్ధి చెప్పాల్సి వస్తుందని విమర్శించారు.

# వైరా లయన్స్ గ్రేట్ విజన్ క్లబ్‌ల ఆధ్వర్యంలో తాగునీరు పంపిణీ





**ప్రజాపక్షం/వైరా:** వైరా వ్యవసాయ మార్కెట్ నందు శనివారం జరిగిన ఇందిరా మహిళాశక్తి సంబరాలకు వచ్చిన మహిళలకు, ప్రజలకు వైరా లయన్స్‌క్లబ్ గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా చల్లటి త్రాగునీటిని అందించారు. ఈ త్రాగునీటి కార్యక్రమాన్ని వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్‌నాయక్ లయన్ ఫాస్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణతో కలిసి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతు సేవా కార్యక్రమాల్లో లయప్స్‌కబ్ గ్రేట్ విజన్ క్లబ్ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. ఈకార్యక్రమంలో ఉంద్రుశ్యాం బాబు, చింతలపూడి వెంకటేశ్వరరావు, ఉయ్యూరు రామకృష్ణ, చెరుకూరి శ్రీనివాసరావు, మరికంటి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** నూతంగా ఏర్పడిన అశ్వారావుపేట మున్సిపాల్టీలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయటం జరుగుతుందని కమీషనర్ బి.నాగరాజు తెలిపారు. మున్సిపాల్టీలోని దొంతికుంట, వడ్డెర బజార్, చిన్నంశెట్టి బజార్‌లో మూడువార్డుల్లో వార్డు అధికారులు, ఇతర సిబ్బందితో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అధికంగా అర్హులైన ఇందిరమ్మ ఇళ్లు రాలేదని కమీషనర్‌కు విన్నవించుకున్నారు. సిసి రోడ్లు పోసారు కాని డ్రైనేజిలు కట్టకపోవటంతో సిసి రోడ్లు దెబ్బతినడంతో పాటు ఇళ్లల్లోకి వరద నీరు వచ్చి చేరుతుందని స్థానికులు తెలిపారు. వర్షాలు కురిసే సమయంలో ఇళ్లలోకి వరదనీరు రాకుండా చర్యలు చపట్టాలని కోరారు. సందు రోడ్లల్లో నష్టాలు లేకపోవడంతో వృద్ధులు, పిల్లలు బయటకు రావాలంటే



ఇబ్బందులకు గురవుతున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. వచ్చిన ఫిర్యాదులకు సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని కమీషన్ తెలిపారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కృషి విజ్ఞానకేంద్రం కో ఆర్డినేటర్‌గా సుచరితాదేవి

**ప్రజాపక్షం/వైరా :** వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా శనివారం డాక్టర్ టి సుచరితాదేవి బాద్యతలు స్వీకరించారు. డాక్టర్ సుచరితాదేవి గతంలో హైదరాబాద్‌లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం పరిదిలోని గృహవిజ్ఞాన శాస్త్రంలో పోషకాహారణ విభాగానికి విద్యాలయ అధిపతిగా పనిచేశారు. వైరాలో కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ గా బాద్యతలు స్వీకరించి అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు శాస్త్రవేత రవి బదిలీకావడంతో వైరా కృషి విజ్ఞాన కేంద్రంలో నూతన ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్‌గా సుచరితాదేవి బాద్యతలు స్వీకరించారు.



# సిపిఐ ఖమ్మం జిల్లా 23వ మహాసభల దృశ్యమాలిక



# అవాకులు, చవాకులు పేలితే జిల్లాలో అడుగుపెట్టనివ్వం

**-మా ముఖ్యమంత్రి, మంత్రులను విమర్శించేస్థాయి నీది కాదు**
**-కేటీఆర్‌ను హెచ్చరించిన ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి**



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల బట్టి పొంగిలేటిలపై అవాకులు,చవాకులు పేలితే ఖమ్మం జిల్లాలో అడుగుపెట్టనివ్వమని, వారిని విమర్శించే స్థాయి నీది కాదని ఘాటుగా హెచ్చరించారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు గాదే చెన్నకేశవరావు, శివ వేణుల ఆద్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 9 సీట్లు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవటంతో జీర్ణించుకోలేని తండ్రి, కొడుకులు ముఖ్యమంత్రి, మంత్రులపై అర్థంలేని ఆరోపణలు, చవకబారు విమర్శలు చేయడం వారి ఓర్వలేని తనానికి నిదర్శనమని, ఏ మొహం పెట్టుకొని ఖమ్మం జిల్లా కి వచ్చావని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా అభివృద్ధిని సర్వనాశనం చేసిన మీకు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఇచ్చిన తీర్పు సరిపోలేదా అన్నారు. హామీల గురించి మాట్లాడేది మీరా కేసీఆర్, కేటిఆర్ అంటూ మండిపడ్డారు. దళిత ముఖ్యమంత్రి, దళిత బంధు, బీసీ బందు, ఇంటికొక ఉద్యోగం, దళితులకు మూడు ఎకరాల భూమి, పూర్తిస్థాయిలో రుణమాఫీ ఎక్కడ అంటూ ప్రశ్నించారు. మీరిచ్చిన హామీలు చెప్పుకుంటూ పోతే పుస్తకాలు రాయొచ్చని, హామీల అమలు చెయ్యని మీకు తెలంగాణ రాష్ట్ర ప్రజలు మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని విమర్శించారు. మహిళల ను అవమానపరుస్తూ, హేళన చేస్తూ మీరు చేసిన కామెంట్స్ ని ఒక మహిళగా ఖండిస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నోటికి వచ్చినట్టు తిడుతున్నావ్, మీ దిగజారుడు రాజకీయాలు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తెలుసని, రేవంత్ రెడ్డి మాట నీ నోటి వెంట మరొక్క సారి వస్తే మా ఖమ్మం జిల్లా కార్యకర్తలే నిన్ను తరిమి తరిమి కొడతారన్నారు. మా జిల్లా మంత్రులపై నువ్వు చేసిన కామెంట్స్ సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని, మా జిల్లా మంత్రుల రాజకీయ అనుభవం అంత లేదు నీ వయసని, వారి అనుభవం ముందు నీ అనుభవం దేనికి పనికొస్తుందన్నారు. నీవి పిల్ల చేష్టలని కొట్టిపారేశారు. కాంగ్రెస్ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు ఈ తెలంగాణ రాష్ట్రంలో పాదయాత్ర చేసి ప్రతి పేదవాడి కష్టం తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ గెలుపుకు ప్రధాన భూమిక పోషించిన ఉప ముఖ్యమంత్రివర్యులు భట్టి విక్రమార్కపై నువ్వు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా అభివృద్ధి ప్రదాత మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు ఈ ఉమ్మడి జిల్లాలో చేసిన అభివృద్ధి తెలుసుకోని, చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బహిరంగంగా చాలెంజ్ చేసి మీ పార్టీని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నామ రూపాలేకుండా చేశారని,ఆయనతో నీకు పోటీనా అని, ఆయన గురించి ఒక్క మాట మాట్లాడినా నీ అంతు చూస్తామన్నారు. ఈసారి ఆయన కన్నెర్ర చేస్తే రాష్ట్రంలోనే నీ బిఆర్ఎస్ పార్టీ దిక్కు లేకుండా పోతుందని జోస్యం చెప్పారు. మీ బిఆర్ఎస్ పార్టీ పాలన కాలంలో మీరు చేసిన ఫోన్ ట్యాపింగ్ వల్ల ఎందరో ఆడపిల్లల జీవితాలు తారు మారయ్యాయో ప్రజలందరికీ తెలుసన్నారు. టిఆర్ఎస్ పార్టీ అంటేనే వసూళ్లు దందా, గూండాయిజం, నయవంచన చేసే పార్టీ అని ప్రజల్లో ముద్ర పడిందన్నారు. మీ పార్టీలో ఎన్నికలలో నిలబడే అభ్యర్థులే మీకు కరువయ్యారని ఎద్దేవా చేశారు. ఈ రాష్ట్రంలో, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో మీ బిఆర్ఎస్ పార్టీకి పుట్టగతులు లేకుండా చేస్తామన్నారు. మూడు నెలలకు ఒకసారి వచ్చే మీ అయ్యని, ముందు నీ ఇంటి సమస్యను చక్కదిద్దమని చెప్పాలన్నారు. స్వయంగా మీ అక్క కవితనే నా ఫోన్ కూడా ట్యాపింగ్ అయిందని చెప్పడం దేనికి నిదర్శనమన్నారు. కేటీఆర్ రాకతో ఖమ్మం జిల్లా అపవిత్రమైందన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా కేటీఆర్, కెసిఆర్ దిష్టిబొమ్మలు దగ్ధం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, కమల్ పాషా, పింగుల శామ్యూల్, చల్లగుండ్ల కృష్ణయ్య, అలవాల కరుణాకర్, మానుకోట ప్రసాద్, నాగుల్ మీరా, టోపీ శ్రీను, బత్తుల భరత్, విరివాడ అజయ్, యనమాల అజయ్, ఐ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు పట్టణంలో అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్, అఖిలభారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్‌లను, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ ప్రధాన డిమాండ్లతో శనివారం పట్టణంలో విద్యార్థి, యువకులతో భారీ ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ విద్యార్థి యువజన సంఘాల జిల్లా అధ్యక్షులు ఉమ్మగాని హరీష్, ఎస్ కె షాహిద్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా పెండింగ్లో ఉన్న 8000 కోట్ల పైచిలుకు స్కాలర్షిప్లను ఫీజు రీయింబర్స్మెంట్ లను విడుదల చేయాలని, అదే విధంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని, రాజీవ్ యువ వికాసాన్ని వెంటనే అమలు చేయాలని లేదా కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతకు రుణాలు మంజూరు చేసి ఉపాధి అవకాశాన్ని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో స్కాలర్షిప్ లు, ఫీజు రీయింబర్స్మెంట్ లేకపోవడంతో గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని, ప్రైవేట్ కళాశాలలో కూడా స్కాలర్షిప్ లేకపోవడంతో దాదాపు రాష్ట్రంలో జూనియర్ కాలేజ్ నుంచి ఇంజనీరింగ్ వరకు 400లకు పైగా కళాశాలలు మూతపడ్డాయని ఇదే కొనసాగితే సామాన్య, మధ్య తరగతి విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంటుందని, అదే ఉపాధిగా భావించే చిన్న తరహా ప్రైవేట్ కాలేజి లో చదవాల్సి వస్తే ఫీజు రీయింబర్స్మెంట్ తో సంబంధం లేకుండా విద్యార్థులు సొంతంగా ఫీజులు చెల్లించుకుంటూ చదవాల్సిన పరిస్థితి నెలకొందని ఈ పరిస్థితి మారాలని రాష్ట్ర ప్రభుత్వం వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లోపు 50 శాతం స్కాలర్షిప్లను ఫీజు రీయింబర్స్మెంట్ ను విడుదల చేయాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి అనిల్ యాదవ్, పట్టణ కార్యదర్శి ఈర్ల రవి, టౌన్ వైస్ ప్రెసిడెంట్ రాకేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్వేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# వాణి వివేకానంద విద్యాలయంలో ఘనంగా బోనాల జాతర

**ప్రజాపక్షం/వైరా:** వైరా వాణి వివేకానంద విద్యాలయంలో ఆషాడ మాస సందర్భంగా బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో మహిళా టీచర్స్ బోనాలు తయారు చేసి అమ్మవారి విగ్రహాలను అలంకరించి పాఠశాల విద్యార్థిని, విద్యార్థులతో బోనాల వేడుకలను ప్రారంభించారు. ఈ బోనాలు వేడుకలకు ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ చుండూరి కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ వాణి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకమైన పండుగ బోనాలు అని, ఈ యొక్క పండుగ మన సొంత రాష్ట్రంలో జరుపుకోవడం చాలా ప్రత్యేకతతో కూడుకుందని, మన ఆచార సాంప్రదాయాలకు బోనాల పండుగ ఇలాంటి పండుగ వేడుకలను మన పాఠశాలలో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని వారు తెలియజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో



అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కన్వీనర్ గింజుపల్లి జనార్ధన్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 16వ డివిజన్‌లో గల తెలంగాణ మైనార్టీ బాలికల పాఠశాలలో విద్యార్థినిలకు వ్యాసరచన పోటీలను శనివారం నిర్వహించారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచనల మేరకు ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ మార్పులు వంటి అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీలను అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనిల్‌కుమార్ పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంచే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

# కెటిఆర్ దిష్టిబొమ్మ దహనం



**ప్రజాపక్షం/పెనుబల్లి:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖమ్మంలో పర్యటించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు భట్టి, పొంగులేటి, తుమ్మల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల అనుచిత వ్యాఖ్యలను పెనుబల్లి మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వియ్యం బంజర్ రింగ్ సెంటర్లో కెటిఆర్ దిష్టిబొమ్మని దహనం చేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు పంది వెంకటేశ్వరరావు, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, అన్నపురెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు చూసి ఓర్వలేక కల్వకుంట్ల తారక రామారావు కాంగ్రెస్ ప్రభుత్వం పై, ముఖ్యమంత్రి, మంత్రులపై మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పెనుబల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, చీకటి రామారావు, కీసర శ్రీనివాస్ రెడ్డి, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, రాజపోయిన కోటేశ్వరావు, గూడూరు మాధవరెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా బొర్రా రాజశేఖర్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ జన్మదిన వేడుకలు వైరాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపాల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, మిట్టపల్లి నాగి, పట్టణ కాంగ్రెస్ నాయకులు దార్న రాజశేఖర్, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ మెంబర్ మచ్చా రామారావు, రేచర్ల సత్యం, జాలాది రామకృష్ణ, వీరంశెట్టి సీతారాములు, దార్న వెంకటేశ్వరరావు, సుగ్గల శ్రీనివాస్, దేవిశెట్టి సైదులు, కొమ్మూరి శ్రీనివాసరావు, జాలాది వెంకటయ్య, గుగులోతు వెంకట్, దేవభక్తిని బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# బోనమెత్తిన న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాల



**ప్రజాపక్షం/వైరా:** న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఆడపడచులు, విద్యార్థులు అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారి, పోతురాజు వేషధారణను ధరించి మహంకాళి అమ్మవారి వారి బోనాన్ని ఎత్తుకున్నారు. అదేవిధంగా పోతురాజు వేషధారణ, డప్పువాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్ అమ్మవారికి నైవేద్యం సమర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి, సాంప్రదాయానికి బోనం నిలువెత్తు నిదర్శన.ం, బోనం అంటే భోజనం కొత్త మట్టి కుండలో గాని, రాగి బిందెలో గాని అమ్మవారిక ఇభోజనం, బెల్లం, ఆకుకూరలతో కలిపి అమ్మవారికి బోనం సమర్పిస్తామన్నారు. తెలంగాణలో గ్రామ దేవతలను రకరకాల పేర్లతో శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని పూజిస్తామని మాట్లాడుతూ శ్రావణ మాసంలో వచ్చే వరదల నుండి అంటువ్యాధుల నుండి మనల్ని కాపాడమని వేడుకుంటూ ఘనంగా పూజలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ భూమేష్‌రావు, కుర్రా సుమన్, పాఠశాల ప్రిన్సిపాల్ షాజీమ్యాథ్యూ, ఏవో నర్సింహారావు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం పెద్ద కోరు కొండి గ్రామానికి చెందిన కోమటి లాజరు (35) మే నెల 12వ తేదీన చిన్న కోరుకొండి పెద్ద కోరు కొండి మధ్య పెట్రోల్ బంక్ సమీపంలో రాత్రి సమయంలో గేదె అడ్డు తగిలి ప్రమాదానికి గురికావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. వైద్యం పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందారు. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. అతని మృతి పట్ల మండల పరిధిలోని ప్రముఖులు, ప్రజాప్రతినిధులు అతని భౌతిక దేహం ను సందర్శించి నివాళులర్పించారు. అతను గ్రామంలో యువజన సంఘాల సమస్యలు పరిష్కారం నిర్వహణ పై ప్రముఖ పాత్ర వహించారు. అతని మృతితో కాలనీలో విషాదఛాయలు పాల్గొన్నాయి.

# జయశంకర్ నగర్ గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరించాలి

**సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య**



**ప్రజాపక్షం/మణుగూరు:** జయశంకర్ నగర్ గ్రామంలో ఉన్న సమస్యలు వెంటనే పరిష్క రించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య డిమాండ్ చేశారు. శనివారం జయశంకర్ నగర్ గ్రామంలో సీపీఐ గ్రామ శాఖ సమావేశం సర్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఉన్న జయశంకర్ నగర్ పూర్తి గావస్సీ గ్రామమైన ఈ గ్రామాన్ని ఎవరు పట్టించుకోవడంలేదని, అర్ధ రాత్రి అయినా కనీసం వీధిలైట్లు వెలిగే పరిస్థితి లేదని అసలు లైట్లే రావడం లేదని, గ్రామాల్లో రోడ్ల వెంట చెత్త పెరిగి అధ్వానంగా ఉందని, పాములు సంచరిస్తున్నాయని అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. వీరి పట్ల అధికారుల చిన్న చూపు చూడొద్దని అన్నారు. ఒకప్పుడు మల్లెపల్లిలో మంచిగా బతికినటువంటి ఈ గ్రామాలు సింగరేణి కి ఉన్న భూములు, ఇండ్లు అన్ని కోల్పోయి, సింగరేణికి ఇచ్చి, చెట్టు కు ఒకరు పుట్టకు ఒకరు లాగా వీరి పరిస్థితి ఉందన్నారు. సుదూర ప్రాంతంలో ఇక్కడ ఇండ్ల నివాసం ఏర్పాటు చేసుకున్నారని ఈ ప్రాంతాన్ని సింగరేణి అధికారులు, ఇటు పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని, సింగరేణి దృష్టి సారించాలని, వాళ్ళ అభివృద్ధి కొరకు కృషి చేయాలని, అనేక మంది పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి తీసుకొచ్చారని, వెంటనే సింగరేణి సంబంధిత అధికారులు కూడా వీరికి పని కల్పించేలా కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. పంచాయతీ అధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రామాల మౌలికవసతులు కల్పించి ఇబ్బందులు లేకుండా చూడాలని, బావులలో క్లోరినేషన్ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ పార్టీ పేద ప్రజలకు సంక్షేమం కోసం పాటుపడుతుందని దాంట్లో మీరందరూ పనిచేయాలని, పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేయాలని, మీకూ అండగా సిపిఐ నిలుస్తుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పినపాక నియోజకవర్గం కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు జంగం మోహన్ రావు, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి సీతారాములు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీ శాఖ కార్యదర్శిగా నాగెల్లి సర్వేశ్వరరావు, సహాయ కార్యదర్శి గా బిలపాటి ఆదినారాయణ, గౌరవ అధ్యక్షులు గా నుగుల సమయ్య, 7 గురు తో నూతన కమిటీ ఎన్నుకున్నారు.

# జీవో నెంబర్ 49 వెంటనే రద్దు చేయాలి



**ప్రజాపక్షం/లక్ష్మీదేవిపల్లి** :లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో శనివారం తుడుందెబ్బ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షు లు ననప కోటేశ్వర రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొమురం భీం కన్జర్వేషన్ కారిడార్ పేరిట ఆదివాసీ ప్రాంతాల విధ్వంసాలకు పూనుకున్నారని అన్నారు. అడవిని నమ్ముకొని అడివిలో నివాసం ఉంటున్న ఆదివాసీలను అడివికి దూరం చేయాలని చూస్తున్నారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 5వ షెడ్యూల్ ప్రాంతంలోని భారత రాజ్యాంగంలో పొందుపరిచిన 1/70 చట్టం, పిసా చట్టం, ఆదివాసి చట్టాలను, ఆదివాసిల హక్కులను, జీవోలను ఉల్లంఘిస్తూ, ఆ ప్రాంత గ్రామసభల తీర్మానాలు లేకుండానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొమురం భీం కన్జర్వేషన్ కారిడార్ పేరిట తీసుకువచ్చిన జీవో నంబర్ ను 49 ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 21 న తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్ కు పిలుపునివ్వడం జరిగిందని, బంద్ ను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దారబోయిన రమేష్, బండారు సూర్యనారాయణ, ఊకె రామకృష్ణ, తమబల్ల రవి, పాయం నరసింహ రావు, తాటి లక్ష్మన్, వట్టం కార్తీక్, కోరెం కృష్ణ , వాసం పొలయ్య పాల్గొన్నారు.

# సిపిఐ లక్ష్మీదేవిపల్లి మండల కార్యదర్శిగా లక్ష్మీపతి



**ప్రజాపక్షం/లక్ష్మీదేవిపల్లి :** సిపిఐ లక్ష్మీదేవిపల్లి 4వ మండల మహాసభ మండలంలోని హమాలి కాలనీ నందు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లక్ష్మీదేవిపల్లి మండల కార్యదర్శిగా దిటీ లక్ష్మీపతి, సహాయ కార్యదర్శులుగా దారా శ్రీనివాస్, నునావత్ గోవిందు , కోశాధికారిగా కళ్లెం పూర్ణచందర్ రావు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యవర్గ సభ్యులుగా 44 మంది, మండల కౌన్సిల్ సభ్యులుగా 95మంది ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా తమపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పజెప్పినందుకు ధన్యవాదములు తెలిపారు. రాబోయే రోజులలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తామని అన్నారు. సిపిఐ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

## పెండింగ్‌లో స్కాలర్‌షిప్,
# ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

**ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వర్మ అజీత్**




**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు పట్టణ కేంద్రంలో శనివారం ఏఐఎస్ఎఫ్ మణుగూరు మండల సమితి ఆధ్వర్యంలో, పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలని మణుగూరు తహశీల్దార్ ఆఫీస్ ను ముట్టడించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వర్మ అజీత్ పాల్గొని మాట్లాడుతూ నాటి ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్ రెడ్డి పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. ఎంతో మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందారన్నారు. కానీ నేడు అధికారంలో ఉన్న అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తోందన్నారు. అధికారం చేపట్టి పది నెలలు కావస్తున్నా ఇంత వరకు విద్యారంగంలో ఉన్న సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్న విద్యాశాఖ, రేవంత్ రెడ్డి దగ్గరే పెట్టుకుని కనీసం విద్యార్థుల సమస్యలపై దృష్టిపెట్టకుండా, 16 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగటం ఆడుతున్నారని ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మొండి వైఖరిని మార్చుకోవాలని, స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం లేక దూర ప్రాంతల నుంచి వచ్చే విద్యార్థులకు ఇబ్బంది అవుతుందని వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మణుగూరు మండల తహశీల్దార్‌కి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈసపల్లి పవన్ సాయి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అక్కినపల్లి నాగేంద్రబాబు, ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు ఇరుగు నవీన్, కొప్పుల పవన్ కళ్యాణ్, ఎస్కే నాసిర్, ఎస్కే షబ్బీర్, పల్లెర్ల రవి వర్మ, యశ్వంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

# శివ ప్రసాద్‌కు నివాళి



**ప్రజాపక్షం/దమ్ముపేట:** దమ్మపేట మండలం మొద్దుల గూడెం గ్రామంలో తెలంగాణ ఉద్యమకారుడు శావిలి శివ ప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శనివారం వారి స్వగృహం మొద్దుల గూడెం గ్రామంలో జరిగిన దశదినకర్మ లో తెలంగాణ ఉద్యమ నాయకులు ముళ్ళ పూడి వెంకటేశ్వరరావు, తెలంగాణ ఉద్యమ నాయకులు కర్లపూడి బాబు, నాయుడు పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, మనో ధైర్యం నింపారు.

# పట్టణంలో డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన

**-ప్రత్యేక స్టాల్ ద్వారా విక్రయాలు**



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మున్సిపాలిటీలోని మెప్మా, ఆధ్వర్యంలో స్వయంశక్తి సంఘాలు తయారుచేసి విక్రయిస్తున్న ఉత్పత్తులు పలువురిని ఆకట్టు కుంటున్నాయి. శనివారం పట్టణంలోని పూల మార్కెట్ చౌరస్తాలో స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రత్యేక స్టాల్ ను ఏర్పాటు చేసి పలురకాల చేతి ఉత్పత్తులను ప్రదర్శించి అమ్ముతున్నారు. స్టాల్ లో ప్రత్యే క ఆకర్షణలు పలురకాల ఉత్పత్తులైన, జూట్ బ్యాగ్స్, మేదరి వస్తువులు, చేనేత వస్త్రా లు, హెర్బల్ ఆయిల్స్, సబ్బులు, వివిధ రకాల పచ్చళ్ళు, సమోసా లు, అల్లికలు, లిప్కాన్ వర్క్ తో తయారు చేసిన మెమెంటోలు వంటి పలురకాల ఉత్పత్తులు ఈ స్టాల్ లో అందుబాటులో ఉన్నాయి. పలు ఉత్పత్తులు ఇక్కడ ఆకర్షణగా నిలుస్తున్నాయి. మండలంలోని పలు స్వయం సహాయక సంఘా ల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఇక్కడ విక్రయించడంతో పాటు చేనేత వస్త్రాలు, హస్తకళలు, ఆహార పదార్థాలు, మార్కెట్ రేటు కంటే ఇక్కడ తక్కువ ధరలకు అమ్ముతున్నారు.

# విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి





**ప్రజాపక్షం/పినపాక:** రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి, ఈ నెల 23 తేదీన జరిగే విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి మదాసు అఖిల్ కోరారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు 20 నెలలు కావస్తున్న ఇంతవరకు పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్స్ , ఫీజు రీయింబర్స్మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలను విడుదల చేయలేదని దీని కారణంగా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, గురుకుల పాఠశాల కు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నడిపించడం వలన విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన అంటూ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని చదువుకునే విద్యార్థులందరికీ ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ సభ్యులుగా చర్ప ఓంకార్, బానోత్ లత్రశ్రీ, నూనె శ్రీనికేతన్, సంతుకూరి హర్షిత లను మండల కమిటీ సభ్యులు గా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రేగుళ్ళ హరీష్, బోడ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువులో రాణించాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** విద్యార్థులు చదువులో రాణించాలని మండల విద్యాశాఖ అధికారి ఎదు సింహ రాజు అన్నారు. మండలంలోని మోరంపల్లిబంజర గ్రామంలోని స్టెల్లా మేరీ స్కూల్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఇటీవల కాంపిటీషన్ ఎగ్జామ్‌లో రాణించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. స్కూల్ లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉందన్నారు. విద్యలో రాణించి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమలత, టీచర్స్ శరణ్య, నవనీత, శారద, భార్గవి, దివ్య, గ్రేస్, కుసుమాంజలి, సుజాత, మిన, వసంతకుమారి, అమల, స్వాతి, కతీజ, పుల్లయ్య, కౌశిక్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# బాలింత మృతి



**ప్రజాపక్షం/పినపాక:** మండల పరిధిలోని వెంకట్రావ్ పేట గ్రామానికి చెందిన దర్రాజు దుర్గ (28) అనే బాలింత మృతి చెందింది. శనివారం తెల్లవారుజామున నిద్రలేచే సరికి మంచంలోనే చనిపోయి ఉన్నట్లు భర్త ప్రవీణ్, బంధువులు తెలిపారు.మృతురాలికి మూడు నెలల బాబు ఉన్నాడు. ఆమె మృతి చెందడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

## టియుడబ్ల్యూజె (ఐజెయు)
# జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ మధిర :** వైరా పట్టణంలో ఈ నెల 24న జరగబోయే టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు కోరారు. శనివారం స్థానిక రెడ్డిగార్డెన్స్‌లో జరిగిన జర్నలిస్టుల సమావేశంలో ఆయన మాట్లాడారు.అనేక సంవత్సరాలుగా జర్నలిస్టుల సమస్యలపై టియుడబ్ల్యూజె ఐజెయు ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు చేసి జర్నలిస్టుల హక్కులను సాధించామని ఆయన గుర్తు చేశారు. టియుడబ్ల్యూజె పోరాటాల ఫలితంగానే గ్రామీణ ప్రాంత విలేకరులకు అక్రిడేషన్ వచ్చినట్లు ఆయన తెలిపారు.ఈ మహాసభలో జర్నలిస్టుల సమస్యలపై సుధీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ఈ నెల 24న వైరాలో జరిగే టియు డబ్ల్యూజె ఐజెయు జిల్లా మహాసభలకు జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు తరలివచ్చి విజయవంతంచేయాలని ఆయన కోరారు. ఈ మహాసభలకు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ హాజరు



కానున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు పాగి బాలస్వామి, టికె.ప్రసన్నన్, కాకరపర్తి శ్రీనివాసరావు, మధు, రమేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రైబల్ మ్యూజియంలో గోత్రాలు ఇలవేల్పుల చరిత్రకు ప్రణాళికలు

**-ఐటిడిఏ పిఓ బి రాహుల్**

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** భద్రాచలం ఐటిడిఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంలో ఆదివాసి తెగల జీవన విధానాలు సాంస్కృతిక సాంప్రదాయాలు ప్రతిబింబించేలా సమకూర్చడంతో పాటు వారి యొక్క గోత్రాలు ఇలవేల్పుల చరిత్రను మ్యూజియంలో అందుబాటులో తేవడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఐటిడిఏ పీవో బి రాహుల్ అన్నారు. శనివారం ఆళ్లపల్లి మండలంలోని పెద్దూరు గ్రామంలో ఆదివాసి తెగల గోత్రాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ గ్రామానికి వచ్చిన ఐటిడిఏ పీవోను కొమరం వారి ఇలవేల్పు కుటుంబాలు సాంప్రదాయపరంగా ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవతకు పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దలు సిరి రెక్కల రామక్క ఇలవేల్పు జీవిత చరిత్రను వారి సాంప్రదాయపరంగా పీవోకు వివరించారు. శ్రీరెక్కల రామక్క ఇలవేల్పు జీవిత చిరిత్రను సావధానంగా విన్న తర్వాత ఆయన మాట్లాడుతూ భద్రాచలం ఐటిడిఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంలో గతంలో కొన్ని సౌకర్యాలతో పరిమితమైన ఈ మ్యూజియం ప్రస్తుతం



అన్ని హంగులతో చూపర్లను ఆకట్టుకునే విధంగా గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు , ఆచారాలు, జీవన విధానం కళ్ళకు కట్టినట్లు ఉట్టిపడేలా పొందుపరడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో గిరిజనులకు సంబంధించిన అద్భుతమైన కళాఖండాలు సేకరించి మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచుతామన్నారు. ఈకార్యక్రమంలో ఇల్లందు ఏటిడిఓ రాధమ్మ, మ్యూజియం ఇంచార్జ్ వీరాస్వామి, వివిధ తెగల ఆదివాసి గిరిజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరం

**-సీనియర్ ప్రెస్ క్లబ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఏర్పాటు**

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల సీనియర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నేడు మండలంలో పరిధిలోని ఆదివాసీ గ్రామం నల్లబండబోడు గ్రామంలో నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగిం చేసుకోవాలని సీనియర్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ కొలిపాక చంద్రశేఖర్ అన్నారు. సీనియర్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును నల్లబండబోడు గ్రామంలో పాఠశాల నందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పి రోహిత్‌రాజ్ ప్రారంభించనున్నారని తెలిపారు. పేద మధ్యతరగతి వర్గాల ప్రజలకు అధునాతన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఈ హెల్త్ క్యాంపు ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో లభించే వైద్య పరీక్షలను అందుబాటులోకి తీసుకువచ్చి, సీజనల్ సంబంధిత వ్యాధులు డెంగ్యూ ఫీవర్, మొదలైన జబ్బులకు ఉచితంగా పరీక్షలను నిర్వహించి మందులను అందజేస్తామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి నిష్ణాతులైన వైద్య సిబ్బంది, వైద్య శిబిరంలో కొత్తగూడెం పట్టణానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ బాబురావు, డాక్టర్ రాజశేఖర్ అయ్యప్ప, డాక్టర్ స్రవంతిలు ఆదివాసి గిరిజన గ్రామంలో ఉచిత వైద్య సేవలు అందించనున్నారని అన్నారు. నల్లబండబోడు గ్రామంలోని పేదలందరికి ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటు, అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# వడ్డీ లేని రుణాలతో మహిళల ఆర్థిక ఎదుగుదల

**ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్**

**ప్రజాపక్షం/వైరా:** వైరా వ్యవసాయ మార్కెట్ నందు శనివారం ఇందిరా మహిళాశక్తి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకంలో మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు స్వయం ఉపాధి కల్పించే విధంగా చేయాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తూ వారిని వ్యాపారవేత్తలుగా చేయాలని ఉద్దేశ్యంతో అనేక వ్యాపారాలను మెప్మా ఐకెపిల ద్వారా డ్వాకా సంఘాలను అభివృద్ధి చేసి వారి పురోగతి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, మీ అందరికి అభివృద్ధి కోసం వైరా నియోజకవర్గంలో పెద్ద ఎత్తున మీ అందరికి అండదండలుగా ఉంటానని అక్కాచెల్లెమ్మలకు హామీ ఇస్తున్నాను. డ్వాక్రా సంఘాల మహిళలకు పెట్రోల్ బంకులు స్వయం ఉపాధి యూనిట్లు అందించే వారి యొక్క ఆర్థిక పురోగతికి రాష్ట్ర ప్రభుత్వం దోహదపడుతుందని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థకార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, వైరా, కొణిజర్ల సొసైటీ చైర్మన్లు




బొర్రా రాజశేఖర్, చెరుకుమల్లి రవి, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డిఎస్‌వో శైలజ, పిడి, మెప్మా సంఘాలు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, వైరా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, కొణిజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు వడ్డే నారాయణరావు, ఏన్కూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు స్వర్ణ నరేందర్, మాజీ మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, పొదిల హరినాథ్, గోసు మదు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, బోళ్ళ గంగారావు, పాలేటి నర్సింహారావు, పమ్మి అశోక్, కోసూరి శ్రీను, ఫణితి శ్రీను, పల్లపు కొండలు, దార్న రాజశేఖర్, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, కట్ల సంతోష్, గరిడేపల్లి కిషోర్ పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు

**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ డిగ్రీ అటానమస్ కళాశాలలో కళాశాలలో ఖాళీగా ఉన్న కెమిస్ట్రీ 01, డైరీ సైన్స్ 01, కామర్స్ 01, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ 03, ఎకనామిక్స్ 02, ఇంగ్లీష్ 02, హిందీ 01, హిస్టరీ 01, ఫిజిక్స్ 01, పొలిటికల్ సైన్స్ 01, తెలుగు 01, జువాలజి 01 మొత్తం 16 అతిథి అద్యాపకుల పోస్టులకు ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిహెడి/నెట్‌సెట్ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అదే విధంగా సంభంధిత సబ్జెక్టలలో ఓసి, బిసి వారికి పిజీలో 55 శాతం మార్కులు, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి కలిగిన వారు తమ ధరఖాస్తులను ఈ నెల 22వ, తేదీ సాయంత్రం 5 గంటలల లోపు కళాశాలలో అందజేయాలని, 23 వ, తేదీ ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

# చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

**ప్రజాపక్షం/పాల్వంచ :** ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం పాల్వంచ పట్టణ పరిధి టీచర్స్ కాలనీకి చెందిన గోకినపల్లి విజయ (38) తన భర్తతో విభేదాలు రావటంతో గత కొన్నాళ్ళుగా తన ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నది. పనుల కోసం ఉదయం బయటకు వచ్చిన విజయ ఎంతకూ తిరిగి రాకపోవటంతో ఆమె కుటుంబ సబ్యులకు అనుమానం వచ్చింది. జాడ తెలుసు



కోవటానికి వచ్చిన వారికి చింతల చెరువు కట్టపై మృతురాలి చెప్పులు కనిపించాయి. చెరువులో చూడగా నీటిలో చీర కనిపించినది. దీనితో ఆమెను బయటకు తీసుకొచ్చారు. అప్పటికే మృతి చెందినది. కాగా తన భర్త హైదరాబాద్‌లో మరో మహిళతో కలిసి వేరుగా ఉటున్నాడని దీనితో తీవ్ర మనోవేదనకు గురైన విజయకు మానసిక స్థితి బాగాలేకపోవటంతో ఆత్మహత్యకు పాల్పడిందని అంటున్నారు. పూర్తి వివారలు తెలియాల్సి ఉంది.

# పిడుగుపాటుకు రైతు మృతి

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** పిడుగుపడి రైతు మృతి చెందిన సంఘటన శనివారం చంద్రుగొండ మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెంకటియా తండ గ్రామానికి చెందిన రైతు బానోత్ రవి(38) తనకు గల పత్తి చేనులో అరకతో పైపాటు చేస్తుండగా, సాయంత్రం వేళలతో ఉరుములతో కూడిన వర్షం



ప్రారంభమైంది. ఈక్రమంలో పంట చేనులో ఉన్న రైతు బానోతు రవిపై ఆకస్మాత్తుగా పిడుగుపడి స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే తోటి రైతులు, గ్రామస్తులు కలిసి చంద్రుగొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే అతడు మృతి చెందిన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య కవిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రైతును ఆదుకోవాలని గ్రామస్తులు, తోటి రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# పదేళ్ల కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చింది..

**ప్రజాపక్షం/ములకలపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం 10 సంవత్సరాల ప్రజల కలలను నెరవేర్చిందని ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ అన్నారు. శనివారం మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసంద



ర్భంగా నూతనం మంజూరైన కొత్త రేషన్ కార్డులను స్వయంగా లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న అనేక మంది పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయం జరగడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని దీవించాలని సూచించారు. ఈకార్యక్రమంలో మండల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** పాపకొల్లు ఏఐటియూసి ఆటో అడ్డ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఆటో అడ్డ ప్రెసిడెంట్‌గా నిమ్మటూరి లచ్చయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా కాతిరాజు శివకృష్ణను ఎన్నుకున్నారు. వీరితో పాటుగా కార్యదర్శిగా గార్లపాటి వీరభద్రం, కోశాధికారిగా మోదుగు దానియేలు, సలహాదారులుగా ఎస్‌కే బుడెన్, పానుగంటి మహేష్, కనకపుడి నరసింహారావు, ధర్మ, సుందర్‌రావు, చిరంజీవి, కిలారి నరేష్, లక్ష్మణ్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన ప్రెసిడెంట్ మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు.



